## క్లుప్తంగా

### చిన్నారులకు సర్టిఫికెట్ల బహూకరణ



చిన్నారులకు సర్టిఫికెట్లు అందించిన నిర్వాహకులు

మల్కాపురం: శ్రీరామ నవమి ఉత్సవాలను 61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీలోని కోదండ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన చిన్నారులచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. సీతారాముల పాటలతో కోలాటం నిర్వహించారు. నిర్వాహకులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు సర్టిఫికెట్‌లు,జ్ఞాపికలు బహూకరించారు.

### ఎర్నిమాంబకు నవమి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

### సున్నితమైన అంశంపై విమర్శలా..

గోపాలపట్నం: తిరుమల తిరుపతి దేవస్థానం విషయంలో విమర్శలు చేయడం తగదని ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతున్నారన్నారు.తిరుమల గోశాలలో గోవులు వృద్ధాప్యంతో మృతి చెందాయని తెలిపారు. సున్నితమైన అంశాన్ని తీసుకుని భక్తుల మనోభావాలు దెబ్బ తీయవద్దన్నారు. జిల్లా పరిషత్ ప్లస్2లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో నారి పిన్ని సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

### నేడు గాంధీ గ్రామ్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాటి విద్యార్థులు

మల్కాపురం: షిప్‌యార్డ్ గాంధీగ్రామ్ పాఠశాలలో 1974–75లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం కలవనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను నాటి విద్యార్థి, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం చూస్తున్నారు. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో వీరంతా కలవడానికి ఏర్పాట్లు చేశారు. అమెరికా,కెనడా,ముంబయ్,బెంగళూర్,హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో స్థిరపడిన వారికి కూడా ఆహ్వానాలు అందించారు. వారిలో కొందరు ఇప్పటికే చేరుకున్నారు. సోమవారం సందడి చేయనున్నారు.

# పేదల సంజీవని!

పారిశ్రామిక ప్రాంత సంజీవనిగా కోరమాండల్ మెడికల్ సెంటర్ నిలుస్తోంది. కేవలం రూ.10 కే ఇక్కడ కార్పొరేట్ వైద్యం అందుతోంది. దీనికి తోడు మందులు, రక్తపరీక్షలు కూడా రాయితీపై చేస్తున్నారు. దీంతో పేదలకు వైద్య భరోసా కల్పిస్తోంది. పారిశ్రామిక ప్రాంతం నుంచే కాకుండా గాజువాక వంటి ప్రాంతాల రోగులు ఇక్కడకు వచ్చి వైద్యం సేవలు పొందుతున్నారు.






మెడికల్ సెంటర్ వ్యూ

- రూ.10కే కార్పొరేటర్ వైద్యం
- మందులపై 30 నుంచి 70 శాతం రాయితీ
- రక్త పరీక్షలపై 70 శాతం రాయితీ
- నిత్యం 200 మందికి ఓపీ సేవలు
- పారిశ్రామిక ప్రాంత వాసులకు చేరువగా కోరమాండల్ మెడికల్ సెంటర్



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు



రక్త పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు నక్కవానిపాలెం ఎదురుగా కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ 2017లో ఆస్పత్రి ఏర్పాటు చేసింది. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సంస్థ సీఎస్‌ఆర్ నిధు లతో ఏర్పాటు చేసిన ఈ వైద్య కేంద్రంలో మొదట్లో రోజులకు కేవలం 30 వరకూ మాత్రమే ఓపీ నమోదయ్యేది. ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించడంతో రోగుల తాకిడి పెరిగింది. రోజుకు 200 నుంచి 250 వరకు ఓపీ నమోదవుతోంది.పారిశ్రామిక ప్రాంత పేద రోగుల కోసం కోరమాండల్ సంస్థ ఏడాదికి రూ. 70 లక్షల వరకు ఖర్చు చేస్తుంది.

**సేవలు ఇలా..**

ఇక్కడ వైద్య పరీక్షల కోసం వచ్చే రోగి ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ చెబితే వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తారు. అనంతరం రూ.10 చెల్లిస్తే రోగి సమస్య తెలుసుకుని సంబంధిత వైద్యుడి వద్దకు అక్కడి సిబ్బంది దగ్గరుండి తీసుకువెళ్తారు. ఒకసారి రూ.10 చెల్లిసే అదే నెలలో మరో రెండు సార్లు ఉచితం వైద్య సేవలను పొందే అవకాశం కల్పించారు. రోగికి అవసరమైన పరీక్షలు చేస్తే దానిపై 70 శాతం రాయితీ ఉంటుంది. అలాగే ఎక్సరేకి కేవలం రూ. 50 చెల్లిస్తే సరిపోతుంది.రోగికి అవసరమైన మందులపై 30 నుంచి 70 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నారు.

**వైద్య నిపుణుల వివరాలు**

ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఇద్దరు జనరల్ వైద్యులు సేవలు అందుబాటులో ఉంటారు.అలాగే సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకు వైద్య సేవలు అందిస్తారు.

- ఊపిరితిత్తులు మరియు శ్వాసకోస వైద్య నిపుణులు ప్రతి సోమవారం సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకు సేవలు అందిస్తారు.
- చిన్నారుల వైద్య నిపుణులు ప్రతి బుధవారం సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకు వైద్య సేవలు అందిస్తారు.
- చర్మ వ్యాధి వైద్య నిపుణులు ప్రతి గురువారం సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకు అందుబాటులో ఉంటారు.
- కీళ్ల, ఎముకులు వైద్య నిపుణులు ప్రతి మంగళవారం సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకు వైద్య సేవలు అందిస్తారు.
- దంత వైద్య నిపుణులు సోమవారం నుంచి శుక్రవారం వరకు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకు వైద్య సేవలు అందిస్తారు

### థైరాయిడ్ వైద్యం చేసుకుంటున్నా..



కొంత కాలం నుంచి థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నాను. కోరమాండల్ వైద్య కేంద్రం వద్దకు వచ్చి వైద్య నిపుణుల సలహా మేర మందులు తీసుకుని వాటిని వాడాను. బయట కంటే ఇక్కడ మందులు చాలా తక్కువ రేటుకు ఇచ్చారు. నేడు నాకు నిర్వహించిన టెస్టులో థైరాయిడ్ సమస్య చాలా తగ్గిందని వచ్చింది.

– కుమారి, నక్కవానిపాలెం

### ఎముకుల సమస్యతో వచ్చా



కోరమాండల్ ఆస్పత్రికి ఎముకుల సమస్యపై వచ్చి వైద్యుడి సూచనతో మందులు వాడాను.లక్షలు ఖర్చు లేకుండా తక్కువ డబ్బులతో మంచి వైద్యం అందింది. నా ఎముకుల బలహీనత సమస్య దాదాపు తగ్గింది.ఈ ఆస్పత్రి సేవలు పేదలకు అండగా ఉంటున్నాయి.

– చైతన్య కుమార్, మల్కాపురం

## కల్యాణం.. కమనీయం



స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



సుబ్రహ్మణ్యస్వామి రాక కోసం ఎదురుచూస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సీతారామ రాజునగర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. తొలుత వల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అనంతరం స్వామి ఉత్తవ మూర్తులను ప్రత్యేక మండపంపై అధిష్టింపజేసి అర్చకులు తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం గావించారు. అనంతరం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి శాస్త్రోక్తంగా కల్యాణం జరింపించారు. పరిసర కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇచ్చారపు నాగేంద్ర, కార్యదర్శి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం తిరువీధిలో వచ్చిన స్వామిని భక్తులు దారిపొడువునా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పెద్దలు రవి శంకర్, కేఎస్ఎన్ రాజు, భరత్ కుమార్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

## విద్యుత్ స్తంభాలకు పొదలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



పొదలు తొలగించిన తర్వాత ఇలా..




'సాక్షి'లో ప్రచురితమైన కథనం

విశాఖ విద్య: ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌కు సమీపంలోని గురుజాడనగర్‌లో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పొదలను విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించారు. 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఆదివారం గురజాడ నగర్ ఏరియాలో స్తంభాలకు అల్లుకున్న పొదలను పూర్తిగా తొలగించారు. అయితే, కాలనీల్లో తరచూ పర్యటించి విద్యుత్ లైన్ల నిర్వహణ తీరును పరిశీలించాల్సిన విద్యుత్ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్ఏడీ ఏరియాలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పని తీరు మెరుగుపడేలా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## ఇవేం పనులు!



డివైడర్ల వద్ద రోడ్డు తవ్వేశారిలా..



వుడా లేఅవుట్‌లోని ప్రధాన రహదారి

విశాఖ విద్య: ప్రజావసరాల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రహదారులు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేని కారణంగా కొద్దికాలానికే పాడైపోతున్నాయి. దీనికి జీవీఎంసీ 52వ వార్డులోని వుడా లే అవుట్‌లో తవ్వేసిన రోడ్డే నిదర్శనం. ఎన్ఏడీ జాతీయ రహదారి (ఎన్ఎస్‌టీఎల్ ఎదురుగా) నుంచి శాంతినగర్, నేతాజీ నగర్, పీఎఫ్ ఆఫీసు మీదుగా మర్రిపాలెం వుడా లే అవుట్ వరకు అక్కడ నుంచి తిరిగి జాతీయ రహదారిని కలిపేలా ఉన్న డబుల్ రోడ్డును ఇటీవలే ఆధునికీకరించారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేసి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేసి సుందరంగా కనిపించేలా గ్రీనరీ పెంచుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణించే వారికి ఎంతో ఆహ్లాదకరంగా ఉండేలా పనులు చేశారు. అయితే ప్రస్తుతం డివైడర్లకు ఆనుకొని ఓ వైపు రోడ్డును తవ్వేస్తున్నారు. విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేసేందు ఇలా రోడ్డును తవ్వేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ దారిలో వీధి లైట్లు ఏర్పాటు కోసమే అయితే రోడ్డు నిర్మాణం జరిగేటప్పుడే ముందస్తు ప్రణాళికతో కేబుల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే బాగుండేదని, ఇప్పుడు ఉన్న రోడ్డును పాడుచేయటం ఏంటని ప్రజానీకం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఇలా ప్రజాధనం వృథా అవుతోందని ప్రజానీకం అంటున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు ఇలాంటి పనులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కాలనీ వాసులు కోరుతున్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం



శ్లీవ్ గుర్తు వీధిలో మట్టలకు ప్రార్థన చేస్తున్న ఫాదర్ జాన్ ప్రకాష్



మట్టలతో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ నేతృత్వంలో మట్టల (మ్రానీ కొమ్మల) ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలతో జ్ఞానాపురం వీధుల్లో ప్రార్థనలు చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలి పూజలు నిర్వహించారు. జ్ఞానాపురం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అల్లిపురం తదితర ప్రాంతాల క్రైస్తవులు మ్రానీ కొమ్మలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ క్రీస్తు ప్రభువును జెరూసలేం పట్టణంలోకి వచ్చే సమయంలో నాటి ప్రజలు మ్రానికొమ్మలతో స్వాగతం పలికినట్లు చెప్పారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి తపస్సు కాలంలో మ్రానికొమ్మల ఆదివారం నిర్వహిస్తారన్నారు. దైవపుత్రుని విజయోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. పరిశుద్ధ వారం ప్రాముఖ్యతను వివరించారు. సహాయ విచారణకర్తలు బైబిల్ చదివారు. ఈస్టర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజు చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్లు వినయ్‌కుమార్, అంథోనీ రాజ్, పీపీసీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

**63వ వార్డులో..**

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ, క్రాంతినగర్, చింతల్లోవ తదితర ప్రాంతాల్లో క్రైస్తవులు ఆదివారం మట్టల పండగను ఘనంగా నిర్వహించారు. ఈస్టర్ ను పురస్కరించుకుని క్రీస్తు అనుభవించిన శ్రమదినాలకు గుర్తుగా 40 రోజుల పాటు క్రైస్తవులంతా ఉపవాసంలో, దానధర్మాల్లో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు జెరూసలెంలోకి ప్రవేశించిన రోజున ఖర్జూరపు కొమ్మలకు పువ్వులు అలంకరించి ఆదివారం మట్టల పండగ నిర్వహించారు. కార్యక్రమంలో పలు క్రైస్తవ సంఘాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

### 'పూలే సినిమా విడుదల చేయాలి'

సింధియా: సమసమాజ స్థాపనకు, సమానత్వం కోసం పాటుపడిన మహాత్మా జ్యోతిరావుపూలే జీవిత చరిత్రతో కూడిన చలనచిత్రాన్ని విడుదల కాకుండా అడ్డకోడం తగదని డాక్టర్ అంబేడ్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీత యూవీ రావ్ అన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మనువాద ఆధిపత్యాన్ని, వివక్షను రూపుమాపి, వ్యక్తి వృద్ధికి విద్య చాలా అవసరమని చాటిన మహాత్మాజ్యోతిరావుపూలే చిత్రాన్ని అడ్డుకోవడం రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. సందేశాలు లేని అశ్లీల సినిమాలను విడుదల చేస్తున్న ప్రభుత్వాలు, సెన్సార్ బోర్డు సభ్యులు వాస్తవ చరిత్రతో తెరకెక్కిన సినిమాను అడ్డుకోవడం అంటే దేశంలోని అధిక శాతం జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ బహుజనులను అవమానపరచడమేనని ఆరోపించారు. మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రాన్ని విడుదల చేసి భారతదేశ చరిత్రను ప్రజలకు తెలిసేలా చేయాలని పిలుపునిచ్చారు.

### నేటి నుంచి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను అందిస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లాకు 406 యూనిట్ల సబ్సిడీ రుణాలను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. రూ.16.88 కోట్లతో 32 కేటగిరీల్లో లబ్ధిదారులకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి మే 10వ తేదీ వరకు https://apobmms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు వయసు గల వారు సబ్సిడీ రుణాలకు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డ్, తెలుపు రేషన్ కార్డ్, పాస్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని ఈడీ పేర్కొన్నారు.

## ఆటిజంపై అవగాహన అవసరం




బీచ్ రోడ్డులో వాక్‌ను ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ సంఖబ్రత బాగ్చీ

ఏయూక్యాంపస్: నగరవాసుల్లో ఆటిజంపై అవగాహన పెంచాల్సిన అవసరముందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దీవీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కే బీచ్ రోడ్డులో నిర్వహించిన ఆటిజం అవగాహన నడక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ఆటిజంపై అవగాహన కల్పించడం, ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని సమాజంలో భాగం చేయడం ఎంతో అవసరమన్నారు. శ్రేయ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.ఉషాదేవి మాట్లాడుతూ ప్రతి ఏలా ఏప్రిల్‌లో ఆటిజం అవగాహన మాసంగా నిర్వహిస్తామన్నారు. ప్రతీ 100 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై అవగాహన కలిగి ఉండటం, సరైన సమయంలో స్పందించడం ఎంతో అవసరమన్నారు. పిల్లల్లో ఆటిజం గుర్తించడం, రోజువారి జీవితంలో వారు ఎదుర్కొనే సవాళ్లను వివరించారు. కార్యక్రమంలో దివీస్ లేబరేటరీ డైరెక్టర్ డాక్టర్ దేవేంద్రరావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి పాల్గొన్నారు.

## ముత్యమాంబ జాతరకు సిద్ధం



ముత్యమాంబ



కంచరపాలెం కూడలిలో ముత్యమాంబ అమ్మవారి ఆలయం

కంచరపాలెం: కంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం ముత్యమాంబ వార్షిక నవరాత్రి జాతర మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గవర కంచరపాలెం గ్రామాధ్యక్షుడు మళ్ల రామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాళ్ల రామ గోవింద్, ప్రధాన కార్యదర్శి మళ్ల రమేష్‌గారి తెలిపారు.16న తొలేళ్లలో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, పుట్టబంగారం తేవడం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 17న ప్రధాన జాతర, 24న అమ్మవారి మారువారం జాతర, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం కంచరపాలెం ఫ్లైఓవర్ కూడలిలో అమ్మవారి ఆలయ పరిసరాలు, గాలి గోపురాన్ని సుందరంగా తీర్చిదిద్దారు, సాంస్కృతిక, కార్యక్రమాల నిర్వహణకు వేదికలను, విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నట్లు తెలిపారు.

## అంబేడ్కర్‌కు ఘన నివాళి



దీపారాధన చేస్తున్న రమేష్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్‌ని డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో విగ్రహాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా దీపారాధన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షురాలు సీహెచ్ మంజుల, నాయకులు గొట్టివాడ వెంకటేశ్వరరావు, పూడి గణేష్ , చంద్రశేఖర్, తుంపాల సురేష్ , ఆదారి గణేష్ పాల్గొన్నారు.

సింధియా: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం కాకరలోవ, ప్రకాష్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహాలను బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో మల్కాపురం మండలాధ్యక్షుడు మేరువ అనిల్, సీనియర్ నాయకుడు గజపతిరావు, 63వ వార్డు అధ్యక్షుడు డి.రాజారావు, పెదిరెడ్ల నానాజీ పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి దుర్మణం

అక్కిరెడ్డిపాలెం: స్కూటీపై వెళ్తూ జారిపడిపోయిన వ్యక్తిపై నుంచి లారీ వెళ్లడంతో దుర్మరణం పాలయ్యాడు. ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. పాలవలసకు చెందిన కాకి బాలాజీ రావు (45) ట్రాన్స్ పోర్టు పనులు చేస్తుంటాడు. బాలాజీ రావు రాత్రి పాలవలస నుంచి స్కూటీపై గాజువాక వచ్చాడు. సరిగ్గా వై జంక్షన్ నుంచి 100 అడుగుల రోడ్డుకు వస్తున్న మార్గంలో జంక్షన్ దాటిన తర్వాత రోడ్డు నిర్మాణ సామగ్రి ఉండడంతో జారి పడిపోయాడు. ఇదే సమయంలో గంగవరం పోర్టు నుంచి వెనుక వస్తున్న లారీ బాలాజీ రావుపై ఎక్కేసింది. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య, ఇంటర్ చదువుతున్న కుమార్తె, 10వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారని పోలీసులు తెలిపారు.